

# బయోడేటా

గొప్ప రచయిత్రీమణులలాగా, కథలూ, కథానికలూ, నవలా స్రవంతులూ, యెడతెరిపి లేకుండా, జోరుగా వేయించుకోలేక పోయినాను. ఒకటీ, అరా, గేయాలూ, కదాచితుగా ఓ కథా వారపత్రికల్లో పడుతున్నాయి గదా అని సంతోషించాను. నా షష్ట్యబ్దినాటికి నేనూ రచయిత్రినే అని గర్వపడదామనుకున్నాను.

కాని యీ సంపాదకుడెవరో, వెర్రి నాగన్నలాగా, ''మీ రచన అంగీకరించటమైనది. మీ ముఖచిత్రంతో బాటు మీ బయోడేటా గూడా జతపరిచి పంపండి'' అని వుత్తరం పడేశాడు. ఈ వుత్తరం, యితని కోరికా నన్ను సంకటంలో పడేసింది.

అందరి జీవితాలూ, సాపుగా మెచ్చుతగ్గవిగా, చెప్పుకో తగ్గవిగా వుంటాయా? కొన్ని జీవిత సంఘటనలు చెప్పుకోటానికి వీలుగా వుండవు. మరిచిపోవాలనిపిస్తుంది. యెవరన్నా గుర్తు చేయటం గూడా యిష్టం వుండదు. తప్పేట్టు లేదు. అయినా గుర్తు చేయటం గూడా యిష్టం వుండదు. అయినా చూద్దామని కప్పదాట్లేస్తూ బయోడేటా కూర్చాలని చూశాను.

బాల్యంలో ఆటలంటే యిష్టం. బలంగా చురుగ్గా వుండేదాన్ని. కోలాటమూ, ఔటూ, సీలామండా చిక్కుడు కాయా, దొడ్డాటా గిరాటా, గోటీ బిళ్లా, కర్రా బిళ్ల, అచ్చన గాయలూ, చింతగింజలూ, వామనగుంటలూ, పచ్చాకూ నేలబండా, గట్టీ బిట్టీ రాయ్ రప్ప వంటి ప్రిమిటివ్ గేమ్సులో పాల్గొనేదాన్ని. రాజు బండీ ఆట ముగేసేప్పటికి బాగా పొద్దుకేది. యెవరిదో యేదో చిన్న వస్తువు పోయేది. దానిని నేనే తీశాననీ, దొంగ అని బిరుదిచ్చేవాళ్లు. నా గౌను చిరిగేది. వొంటిమీద యిక్కడా అక్కడా గాయాలయేవి. కొత్తగౌను యిప్పట్లో లభించదని తెలిసినా, మాసికలేసుకోవాలని తెలిసివున్నా, ఆటల్లో గెలిచానని గర్వపడేదాన్ని.

బాల్యం వదలగానే రెక్కాడితే గాని డొక్కాడదని తెలిసింది. మా యింట్లో పప్పుంటే నిప్పుండదు. నిప్పుంటే పప్పుండదు. లాభం లేదని ఒళ్లు

దాచుకోకుండా సాయపడేదాన్ని. పనంటే వెరపు లేదు. ఆకలైతే తీరేది గానీ, యీసడించి, యెకసక్కెమాడేవారు బంధుగులు. మర్యాదలెరుగరేమో ననుకునేదాన్ని. కానీ ఒకరోజు కలవారి అమ్మాయి నలుగురి మెప్పుకోసం, కసింత పని చేసేప్పటికి,

''కమలకి యే కోశానా గర్వం లేదు. వళ్లు దాచుకోదు. అతిశయం యెరగదు'' అన్నారా బంధుగులే.

''అందుకనే కాబోలు మోటు సామెత పుట్టిందనుకున్నా. కలవారి బిడ్డ నుంచుని పోస్తుంటే వెండికడ్డీలాగా వున్నదంటారుట. లేనివారి కూనని, ''కూచుని పొయ్యలేవుటే నడ్డి విరిగిందా?'' అంటారుట.

యవ్వనం తొంగి చూస్తున్నది. పెళ్లి సంబంధాలు పరుగెత్తుకు రాసాగినై. నేను అందమైనదాన్ని బుద్ధిమంతురాలిని, మంచి పనిగత్తెను అనే భ్రమలో వున్నా. కాని పెళ్లి చూపుల కొచ్చిన పురుషుని చూచేప్పటికి మొదటిది కొట్టేశా. పెళ్లి కొడుక్కి నెరిసిన గుండూ, కుండ పొట్టా. ఖరీదైన బట్టలూ, రవ్వ వుంగరమూ కంటబడ్డాయి. కూడా వచ్చిన ఆడంగులలో, కాషాయ వస్త్రాలు ధరించినామె నన్ను పలకరించింది. అప్పుడే మరదలు కింద జమ చేసింది.

''మా తమ్ముడికిప్పటికి మూడు పెళ్లిళ్లు చేశానే. ఒక్క మరదలూ 'మేనల్లుడిడుగో' నంటూ కొడుకును గని, చేతుల్లో వుంచలేదు. నువ్వాపని చేయాలి. తెలిసిందా? నీ అందచందాలు చూసి, మురిసి, పెళ్లి ఖర్చులు మేమే భరిస్తామనటం లేదు'' అని సరసమాడింది.

'' ఇదేదో కన్యాశుల్కమల్లే వున్నదే !'' అనుకున్నాను.

కాని మా జ్ఞాతులు ఆ మూడుముళ్లూ పడకుండా అడ్డుపడి ఆపేశారు. యెలా ఆపేశారంటే.

'' ఆ పిల్ల యీడేరలేదు. మాకు పుష్పవతి అయిన అమ్మాయి వున్నది. పెళ్లి ఖర్చులు మేమే పెట్టుకోగలం'' అంటూ నిశ్చయతాంబూలాలు బలవంతంగా పుచ్చేసుకున్నారు.

అదీ నా మేలుకే అనుకున్నా. కాని ముగ్గురు సవతుల నగలూ మరొక అమ్మాయికి చెందినాయే అని విచారం కలిగింది. అదృష్టం వరించి వస్తే కొడుకును గనే దాన్నీ, వాడు పెద్ద ఆస్తికి అధికారి అయేవాడు అదంతా చేయిదాటి పోయిందని వాపోయాను.

నేనెక్కడ భాగ్యశాలినౌతానోనని, మా దాయాదులు నా మీద కన్నేసి వుండేవారు. రెండో సంబంధం, తృతీయం, నాలుగు, అయిదు, ఆరో సంబంధం ఆడబోయే పెళ్లి కొడుకులను, వాళ్లే టోకరాలేసో, అటకాయించో, నాలోలేని పాడు గుణాలున్నాయని ఆరోపించో, వాళ్లమ్మాయిల నిచ్చుకునేవారు. యేం చేస్తారు మరీ. ఒక్కో దంపతీ ద్వయానికీ, ఆరేసీ, యేడేసీ ఆడ సంతానం. ఆ ఆడ సంతానమేమో, పెళ్లి కెదిగి పోయేవాళ్లు. సంఘం గుర్తు చేస్తూ వుంటుందీ. వుద్యోగాలూ వూరికే రావు.

చివరికెలాగైతేనేం ఒక క్రిమినల్ లాయరు గారు వచ్చారు. ఒక్కొక్క ధర్మపత్నీ, యిద్దర్నీ ముగ్గుర్నీ కని, వచ్చిన పని అయిపోయినట్టు దివికేగారుట. ఆ పిల్లలందర్నీ వెరసి, పన్నెండు మందినీ, సాకి, అభివృద్ధిలోకి తేవటానికో భార్య కోసం వేటకి బయలుదేరాడు టాయన.

అప్పటికి నాకు బాల్యం బాగా వదిలిపోయి, యవ్వనావస్థ వచ్చింది. ''బాగానే వున్నది పెళ్లి కూతురు. నా కోసమా? ఆడదైతే అదే పదివేలు'' అన్నాడాయన.

యెట్లాగో అందరికీ అందరమూ నచ్చాము. అన్నీ నచ్చాయి అనుకున్నా. అదీ భ్రమే. చివరిసారిగా అది గూడా లాయరు.

''నీకేమైనా అభ్యంతరమున్నా, యేదైనా షరతుపెట్టాలని వున్నా నాతో చెప్పేయచ్చే. ''బంగారప్పళ్లు మెరిసేట్టు నవ్వాడు. ''నాకేం లేవండీ. మీకేమైనా వుంటే నాతో చెప్పుకోవచ్చు''.

''బావుంది. నీవు యేది తిన్నా, నాకూ పెట్టాలి. తాంబూలం వేసుకున్నావనుకో, అన్నీ సన్నికల్లులో నూరి, సగం నాకివ్వాలి భోజనంలో అన్నీ మెత్తగానే వుండాలి''.

''మిగిలిన సగం తాంబూలం నాకెందుకూ? నేను నమలగలను. అది వెండిగిన్నెలో వుంచి రాత్రికిస్తా. సరేనా?''

నవ్వు ఆపుకోలేక నవ్వేశాను.

''పెళ్లిలోనూ అంత బాగా నవ్వాలి'' అని లేచాడు.

చాలా సమస్యలు పరిష్కారమౌతున్నట్టే కనబడింది నాకు. జీవితమనే దావాలో గెలవబోతున్నానుకున్నాను. కాని అన్నీ పగటికలలే అయినాయి. ఆ క్రిమినల్ లాయరూ అందని మ్రాని పండే అయినాడు.

తరవాతెప్పుడో తెలిసిందా లాయరుగారు పెళ్లి జేసుకునేందు కెందుకు తరలిరాలేదో, నేనెందుకు క్రిమినల్ లాయరు భార్యనై డజన్ పిల్లల్నీ యెందుకు సాకలేక పోయినానో.

ఆ లాయరుగారి తోడల్లుడు, రైల్వే యిలాకాలో, యింజన్ డ్రైవర్. ఆయన హార్ట్ ఎటాక్ వచ్చి, రైలు తోలుతూనే పోయాడుట. ఈయనకి వైరిచ్చారుట. పరుగెత్తుకుంటూ వెళ్లాడట. అందర్నీ వోదార్చి అపరకర్మలు ముగించి వచ్చేస్తుంటే, విడో అయిన మరదలు వెంటబడిందట.

''బావా! అక్క పిల్లల్నీ నా పిల్లల్నీ నేనే సాకుతా. నీకు నేనూ నాకు నువ్వూ అండగా వుందాము'' అన్నదిట.

యేదో సాగితే పెళ్లెందుకూ అని సామెత. అలా అయినాడట ఆ క్రిమినల్ లాయర్.

ఇంక నా అవస్థ వర్ణనాతీతం. పెళ్లి చేసేద్దామనే సంబడంలోపడి, మా వాళ్లు తక్కినవన్నీ అశ్రద్ధ చేశారు. చదువేమో వానా కాలం చదువూ. ఓ కుట్టు రాదూ, సంగీతం రాదూ. టైపుకి వెళ్లనీయరూ.

'' ఇహ దీని మొహాన పెళ్లి రాత లేదే. వుంటే యిన్నాళ్లా!'' తక్కిన లేకి మాటలు గూడా వాడేస్తూ నోరుబారేసుకున్నారు మా వాళ్లూ, అయిన వాళ్లూ, కాని వాళ్లూ.

ఓ రోజున ఓ స్నేహితురాలు వచ్చింది. కూచుని తీయని కబుర్లు చెప్పింది. మెట్రిక్ పాసుకావటం సులభమన్నది. వెంటనే యేమేమి వుద్యోగాలు రెడీగా వుంటాయో, వాటి జీతాలెంతో చెప్పింది. దాంతో నోరూరి, మెట్రిక్కి ఫీజు కట్టేశాను. తెలుగుతో మెట్రిక్కే గదా అని చదవసాగాను. కాని లెక్కలు మింగుడు పడలేదు. అగమ్యగోచరంగా వున్నాయి. పరీక్షలు పరుగెత్తుకొచ్చినై.

కనీసం ముప్ఫై అయిదూ, నలభై మార్కులు రావాలి అన్నారు నూటికి. నాకు యేడుపొచ్చింది. యేడుస్తూ కూచున్నాను. నా స్నేహితురాలొచ్చి సముదాయించింది. ఆ పేపరు సంగతి చూసేందుకు, నాకొకరు తెలుసు. ఇట్లాటివి ఒడ్డుపట్టిచ్చుటమంటే ఆయనకు సరదా. ఆయన ఫెమినిస్టు. స్త్రీల సమాన హక్కులకై తాపత్రయ పడుతున్నాడు. అన్ని రంగాలలోనూ స్త్రీలుండాలని వుపన్యాసమిస్తాడు. ఇద్దరం పోయి చెప్పుకుందాం రా. నేను ఇంగ్లీషు పేపరూ, హిందీ పరీక్షా బాగా వ్రాయలేదు.

''మనమిప్పుడు ఫెయిలయే రంగంలో వున్నామేమో!''

''ఫరవాలేదు. మన గోడు వినేవాడున్నప్పుడు చెప్పుకు రావాలి'' అని లేవదీసింది.

యేదో ముసలాయనా, లెక్కల మేష్టరూ, రిటైరై ట్యూషన్లు చెప్పుకుంటూ, నల్లగా పొట్టిగా బక్కగా వుండి, దగ్గుతూ, హోమియో వైద్యం చేస్తూ, జీవితం వెళ్లమారుస్తూ వుంటాడీయన, అని వూహిస్తూ, స్నేహితురాలి వెంట వెళ్లాను.

అంతా తారుమారైంది.

ఆయనున్న యిల్లేమో భూలోక వైకుంఠమల్లే వున్నది. ఆయనదేదో పెద్దదే బిజినెస్ నడుపుతున్నాడుట. వయస్సు ముప్ఫై. అసలే తీరైన విగ్రహమేమో, ఆ దుస్తులు వన్నె తెచ్చినై అసలా సూటింగ్ కంపెనీయే యీ మోడెల్ని యేరి, పబ్లిసిటీ కోసం దుస్తులేసుకుని కనబడమన్నారేమో! అనుకున్నాను. ఆపేక్షకూ, అభిమానానికీ లోటు లేదు. మాటలూ చేతలూ అవే వెల్లడించినై. యెయిర్ కూలర్ విజిటర్స్ రూమ్‌ని చల్లగా వుంచింది.

నా తల్లో యింజన్ మోత మొదలైంది. గుండె దడ దడా కొట్టుకోసాగింది. యెందుకొచ్చానా తప్పితే తప్పుతాను అనుకున్నాను. కళ్ల గిర్రున తిరుగుతున్నాయి. రూమూ వూగుతున్నది.

'' ఆ సోఫాలో కూచో పిల్లా ! నించునే వున్నావూ!'' అన్నాడు సోఫాలో కూలబడ్డా. చాలా మెత్తగా వున్నది.

నా స్నేహితురాలు, ఆయన దగ్గర బాగా చనవున్నదేమో, నన్ను పరిచయం చేయకుండా, వచ్చిన పనిని గురించి, నసగకుండా చెప్పింది.

'' ఇద్దరం ఒడ్డున పడాలండీ. ఇంటికి సాయపడాలి'' అని కూచున్నది.

''నాతో చెప్పావుగా. చూస్తా. పేపర్లు దిద్దేవాళ్లలో నాకు తెలిసిన వాళ్లున్నారు. యేం భయం లేదు. ఇదేం యెవరెస్ట్ శిఖరమా యెక్కలేక పోవటానికీ'' అని దిలాసాగా నవ్వాడు. అంతటితో వూరుకోక,

''యీ పిల్ల యెవరూ? చదివి యేం చేయాలనుకుంటున్నదీ? పెళ్లి చేసుకోదా? సంబంధాలు రాకనా? చూసిపెట్టే వాళ్ల లేకనా?'' అని పేలుతున్నాడు. నవ్వుతున్నాడు.

''పిల్లని గాదండీ. ఇంకాయేం పిల్ల? పెద్దదాన్నే. పెళ్లి చెడిపోయింది. ఒకసారి గాదు. పదిసార్లు. పెళ్లిగాదని నిశ్చయించుకుని, వుద్యోగమైనా వెలగబెడదామని, పరీక్షకు అప్పియరైనా. తీరా చూస్తే పరీక్షా చెడినట్టే వున్నది'' అనేశాను.

ఆయన, నా వుద్రేకం, కొత్తలేకుండా వున్న విషయం చెప్పేయటం చూసి పకాపక నవ్వాడు.

ఈ లోపల నౌకరొకడు, ఐస్ క్రీమూ, చల్లని పానీయమూ ఫ్రూట్ శాలడూ జెల్లీ ముక్కలు కలిపిన గాజు కప్పులూ వున్న ట్రే తెచ్చి అక్కడుంచి వెళ్లాడు.

ఆయన తను తీసుకుని, తీసుకోమన్నట్టు తల వూపాడు.

''మీరే తినండి. నాకవి అలవాటు లేవు'' అన్నా నా ఫ్రెండ్ కూడా చూస్తూ కూచున్నది.

నా స్నేహితురాలికీ నాకూ తానే అందించాడు.

''తినండిద్దరూ. ఫరవాలేదు. మీ ఇద్దరి పేపర్ల సంగతీ నే చూస్తాగా. మాటిచ్చాక, చేసి చూపించాలి'' తాను పూర్తి చేశాడు.

''మాంచి వుద్యోగం చేతువుగాని, హవాయి సుందరీ, స్టెనోగ్రాఫరూ, టైపిస్టూ, డాక్టరమ్మా, లెక్చరరూ, లాయరూ, బిజినెస్, బాంక్‌లో వుద్యోగం, సినీ ఫీల్డ్, ఎ ఐ ఆర్, టివి స్టేషన్లో అనౌన్సర్. యేదైనా చేయచ్చు. ప్రయత్నిద్దాము'' ఆయన యిలా మాటాడే మాటలు నా చెవులకింపుగా వినబడినై. తేనె నాకుతున్నట్టున్నది. మనస్సు తేలికై మబ్బులలో విహరించాను.

2

అందరం అన్ని కోణాల్లోనించీ ఆలోచించము. అనుకున్నవన్నీ చేయలేము అనుకోము. ఆశ అనేది మాయలో ముంచుతుంది.

బిజినెస్ మాన్ దయవల్ల బియె డేకుతున్నా. బుడ్డీ దీపమల్లే వెలుగుతున్నది బియె. ఇది అయిందనిపించగానే, జీవిత భీమా సంస్థలో జాబ్ యిప్పిస్తానన్నాడు. అది లాభసాటి. ప్రమాదం లేదు. ఇహ అందరం సుఖజీవనం గడపచ్చు. సంసారం నేనే యీదచ్చు అని కలలు గంటున్నా.

నా స్నేహితురాలు సేల్స్‌గళ్‌గా గుడ్డలషాపులో చేరింది. పెళ్లికూడా చేసుకున్నది. నేను ప్రైవేట్‌గా పరీక్షకు తయారౌతున్నాను. నన్నూ అప్లై చేయమన్నది. చూద్దామని ఒక ప్రకటన చూసి దరఖాస్తు పడేశాను.

ఇంటర్వ్యూకి రమ్మనీ సగం ఖర్చులు భరిస్తామనీ వుత్తరం వ్రాశాడు ఫరమ్ యజమాని. జీతం బాగున్నది. బియె పాసైనా అంత మంచి వుద్యోగం రాబోయిందా అనిపించింది. పర్సనల్ సెక్రెటరీ వుద్యోగమది. నా స్నేహితురాలికి వుత్తరం చూపాను.

''తప్పకుండా వెళ్లిరా. తక్కిన సగం ఖర్చులూ నేనిస్తా. నెమ్మదిగా తీరుద్దువుగాని. చక్కగా అలంకరించుకుని, ఆకర్షవంతంగా కనపడాలి. నవ్వుతూ జవాబులివ్వాలి. శుభస్య శీఘ్రం పోయిరా'' అని ప్రోత్సహించింది.

3

కంపెనీ యజమాని చూపించిన కుర్చీలో కూచున్నా. యెదురుగా పెద్ద బల్ల. అవతల యజమానీ. పక్కగా కుర్చీలు రెండూ. వాటిల్లో యిద్దరున్నారు. నేను వారిని పరిశీలించలేదు. ఆదుర్దావల్ల భయం పట్టుకున్నది.

''బియె చదువుతున్నానన్నావు. చదువు మానేసి వెంటనే వుద్యోగంలో చేరుతావా?'' యజమాని ప్రశ్న.

'' ఆ చదివిన చదువు చాలంటే, అలాగే వెంటనే జాబ్‌లో చేరుతానండీ. నా అభ్యంతరం లేదు. తరవాత డిగ్రీలేదు అని అంటే డిగ్రీ కోసం చదవలేను. ఇంటి దగ్గర నాకు తలకు మించినపని వుంటుంది. మా వాళ్లు చదువుకోనివ్వరు'' తలెత్తి నిదానంగా జవాబిచ్చాను.

యజమాని నవ్వుతూ చూశాడు.

''హమ్మయ్యా! జాబ్ కొట్టబోతున్నాను. వీడి నవ్వు ప్రోత్సాహకరంగా వున్నది'' అనుకున్నాను.

'' ఈ అమ్మాయి నాకు తెలుసు''. పక్కగా వున్న కుర్చీలోవున్న మనిషి వువాచ.

నేనప్పుడు పక్కకి చూశాను. క్రిమినల్లాయరు, సోమేశ్వరం గారు. మీసాలకు రంగు. విలువైన దుస్తులూ. నన్ను చూసి తలవూపాడు. అంటే పెళ్లి చూపులకు వచ్చింది నేనేనని గుర్తుచేయడమన్నమాట.

మళ్లా యజమాని అన్నాడు.

''నీ విషయాలన్నీ నువే చూచుకోవాలి. ఇల్లు, తిండీ వైద్యం, దుస్తులూ''

''అలాగే. జీతం బాగున్నదిగా. నన్ను నేనే భరించుకుంటా. అందుకే

... నిలయం
5452

శ్రీకాకుళం

జాబ్‌కి అప్లై చేశాను'' నవ్వుతూనే భరోసా యిచ్చా.

'పని యెక్కువగా వున్నప్పుడు. రాత్రిళ్లు గూడా పనిచేయాలి. దానికి వేరే పే చేస్తాము. యేదైనా ట్రెయినింగ్‌కి పంపితే వెళ్లాలి. ఒప్పుదలేనా?'' నవ్వు మొహమే.

'' ఒప్పుదలేగానండీ! రాత్రిళ్లు పని అంటే తోడు తెచ్చుకోవాలా? తక్కిన వుద్యోగినులుంటారా?'' సందేహం వెలిబుచ్చాను.

''తక్కిన వాళ్లుంటారు. తెలియబరుస్తాను''.

వెళ్లవచ్చుని అర్థం చేసుకుని, ఆటోలో నాలుగు వీధులూ తిరిగి చూడాలని తట్టి, పర్స్ చూసుకుని, యజమానికి దణ్ణం పారేసి లేచాను. ఆటో పట్టుకుని కాసేపు వూరుచూసి స్టేషన్కి వచ్చాను.

అక్కడ క్రిమినల్ లాయరు సోమేశ్వరం గారూ, ఆయన మిత్రుడూ ప్రత్యక్షమయారు. లాయరుగారేమో నన్ను చూడగానే, నా వేపు వచ్చి యికిలిస్తూ అన్నారు.

''నువ్వు యీ రైలుకి వస్తావని వూహించా. నీ క్కూడా టికెట్ కొన్నా. టిఫిన్ కానిచ్చి పోదాం'' అన్నాడు.

రెండో మనిషి నమస్కారం చేసి మర్యాదగా అన్నాడు. ''మా అబ్బాయికి పని యిప్పిస్తారని వీరిని వెంటబెట్టుకుని, యీయన రికమెండ్ చేస్తే తప్పక యిస్తాడని, మీరు యింటర్వ్యూ కొచ్చిన చోటికే నేనూ వచ్చాను. మా అబ్బాయికీ డిగ్రీ లేదు. రండి. తిండి పెట్టే వాడందినప్పుడు తిని తీరాలి'' ఫలహారశాల వేపు దారితీశారిద్దరూ.

మంచి ఆకలి మీదున్నానేమో మారు మాట లేకుండా వాళ్ల వెంట వెళ్లాను. బాగానే మేపాడు లాయరు.

మళ్లా ప్లాట్‌ఫామ్ మీదికి వచ్చేప్పటికి రైలు లేటని అనౌన్స్ చేశారు. యేదో రైలు పట్టాలు తప్పిందట. బాగు చేసి రాకపోకలు వీలు చేస్తారట. నేను విశ్రాంతి

గృహం వేపు వెళ్లాను. కొనుక్కున్న వీక్లీ తిరగేస్తూ కూచున్నా. యెంతసేపయిందో గుర్తు లేదు. పత్రిక మూసి వేస్తే యెదురుగా లాయరుగారున్నారు. నవ్వి కుర్చీలో కూచుని మంచీ శబ్బరా అడిగాడు. భోగట్టా అయాక నస మొదలెట్టాడు. నేను నవ్వుతున్నాను.

''నీకా వుద్యోగమేం ఖర్మ వచ్చిందీ? నేనున్నాగా, హాయిగా పెళ్లాడి, సుఖశాంతులు కలిగి వుండలేక, ఆ దగుల్బాజీని నమ్మి, రాత్రిళ్లు గూడా పనిచేస్తానని మాటిచ్చావు. నీకు వుద్యోగమిస్తానన్న వాడు నా క్లయంట్. వాడు నమ్మించినమ్మాయి వురిబెట్టుకున్నది ఫానుకు. వాడి రెండో నేరం ఫోర్జరీ చేశాడని. వాడా నీకు యజమాని?''.

''వాడు మీ క్లయంటైతే, మీరు యెదురు కుర్చీలో యెందుకు కూచోలేదు? వాడే మీ యింటికి వచ్చి తన గోడు చెప్పుకోవద్దా? పోనీయండి, నా కెందుగ్గానీ. మీరు సుఖంగా వున్నారా?'' అనడిగాను.

''అదే చెప్పొస్తున్నా. నీకు కాబోయే యజమాని రమ్మని రాస్తే రైలు ఖర్చులచ్చుకుంటానంటే వచ్చాను. నాతో కూడా వచ్చింది నా గుమస్తా. కాగితాలన్నీ పరిశీలించాలని తెచ్చాను.

సుఖమూ లేదు. శాంతీ లేదు నాకు. మా మరదలూ, దాని బలగం, నా యింట్లో చేరి, నా యిల్లు గుల్ల చెయ్యటం తప్పితే, నా అవసరాలే చూడరు. చూడగా, వినగా, వాళ్ల ఆస్తినే తింటున్నట్టున్నాయి. వాళ్ల మాటలు''. ''యేడుపు మొహం పడిందాయనకి నేను నవ్వుతూనే అడిగాను.

''మీరు క్రిమినల్లాయరు గదా, యేదైనా మర్డర్ కేసులోనో, దోపిడీ నేరంలోనో అందర్నీ యిరికించలేకపోయారూ?''

''నేనిరికించేదాకా యెక్కడ? ''అడ్డమైనవాళ్లనూ చేరదీస్తాడు. వాళ్ళను సాగనంపేప్పటికి హతమారుతున్నది. ఒక్కో బిడ్డకీ చౌకలో పెళ్లి చేసుకొస్తున్నామని విశ్వాసమన్నా లేదు. తన గొడవే తనకు'' అని ప్రచారం మొదలెట్టారు. చెడ్డవాణ్ణి చేశారు'' అంటూ ముందుకు వంగి, మాట్లాడుతూ సంధి బేరం మొదలెట్టాడు.

''నువ్వు వచ్చి వాళ్లను తరివేయాలి. నీకు యింట్లో సర్వాధికారాలిస్తాను''

''మీరు పెళ్లి ఆపేసి వెళ్లిపోతే, నేనెన్ని మాటలు పడ్డాను? యెన్ని యీసడింపులు భరించాను? మాట నిలకడలేని మనిషి అని తేల్చేసుకుని, పడి వూరుకున్నాను. ఇప్పుడు మీమీదెందుకుంటుందీ? మరొకత్తెను వెతుక్కోండి'' అని పత్రిక మొహానికడ్డం పెట్టుకున్నాను.

బయట కోలాహలం, దీపాలూ, ఫాను చప్పుడూ, వెయిటింగ్ రూమ్ ఖాళీ గావటం నేను గమనించలేదు. యేదో రైలు వచ్చింది. ఆయన పిల్లిలాగా వచ్చినా పక్కన కుర్చీలో కూచున్నాడు.

''నేను వాడిపాటి చేశాను గానా? అప్పుడు తోడల్లుడు పోవటంతో, మాట తప్పాల్సి వచ్చింది. ఇప్పుడు చేసుకుంటాను'' నా మీదికి వంగి చెవులో చెప్పాడు. కువకువలాడుతున్నాడు.

''ముదిమికి ముచ్చట్లు లావని, సెంటుపూసుకున్నారా?'' అని నవ్వాను. '' ఇప్పుడంటే యీ వెయిటింగ్ రూమ్‌లో పెళ్లాడుతారా? స్టాంప్ యాక్ట్ తెలుసల్లే వున్నది మీకు. అది అమలు చేస్తారా? వాడంటే యెవరూ?'' అని దూరంగా కుర్చీ జరుపుకున్నా.

''అదే నిన్ను చదివిస్తున్నాడే. యెర్రగా వుంటాడు. నేనటువంటివన్నీ పట్టించుకోను. పల్లెత్తుమాట అనను నిన్ను. గతం గతమే నాకు. ఇంట్లో నీ మాటకు తిరుగుండబోదు'' అంటూ లేచివచ్చి నా చేతులు పట్టుకున్నాడు.

బొల్లి పెదిమలు, చత్వారం కాక, శుక్లాలేర్పడుతున్నాయేమో, మందపాటి కళ్ళద్దాలూ, బట్టతలా, చప్పిదవడలూ, చేతులూ తలా వణుకుతున్నాయి.

ఇదెక్కడి జిడ్డు పట్టుకున్నది అని చీదర కలిగింది. చివాలున లేచి, బల్లమీదున్న చేతి సంచీ లంకించుకుని ప్లాట్‌ఫామ్ మీదికి వచ్చేశా. గార్డు పచ్చజండా వూపుతున్నాడు. విజిల్‌మోత పచ్చదీపం. రైలు కదులుతున్నది.

వెనక్కు చూస్తే, ధోతీ పైకి లాక్కుంటూ లాయరుగారొస్తున్నారు. అప్పుడే ఆయన కృత్రిమ పాదం గూడా నా కంటబడింది. బాత్‌లో జారిపడితే ఫ్రాక్చరైందేమో.

''వాడు నిన్ను నట్టేట్లో ముంచుతాడు బుల్లీ! నా మాట విను. పోకు. టికెట్ నా దగ్గరే వున్నది'' నన్ను పట్టుకోవాలని కేకవేస్తూ వస్తున్నాడు.

''మా అమ్మాయిని పట్టుకోండి. కోపమొచ్చి వెళ్లిపోతున్నది. దాని దగ్గర టికెట్ లేదు'' అంటున్నాడు లాయరు.

రణగొణ ధ్వని రైలు కూత. రైలు వెంట పరుగెత్తే మనుషులు. నలుగురూ నన్ను పట్టి ఆయన కప్పగిస్తారేమోనని భయం కలిగింది. ముందాలోచన లేకుండా పరుగెత్తి రైలుపెట్టె, హాండల్ పట్టుకుని, తీసివున్న తలుపు చూస్తూ మెట్టు మీద కాలు వేశాను. ఒక మనిషి లోపలికి లాగాడు. మరొకాయన తలుపు మూశాడు. రైలు వేగం అందుకున్నది.

4

నా స్నేహితురాలు యామిని నానించి వివరాలు లాగింది. ఆమెకా సేల్స్‌గళ్ జాబ్ వదిలేసి, అంతకంటె మంచి వుద్యోగంలోకి పోవాలని వున్నది. యామిని మళ్లా బిజినెస్ రన్ చేస్తున్నవాడిని సంప్రదిస్తూ నా విషయం గూడా చెప్పి వుండాలి.

నేను కోచింగ్ సెంటర్నించి వస్తూ పార్క్‌లోకి వెళ్లి కూచున్నాను. అక్కడ బిజినెస్ మాన్ వెలిశాడు. సెర్మన్ లాగా చెప్పుకెళ్లాడు. వెతికిపట్టుకున్నాడేమో.

''నువ్వు చేయాలనుకుంటున్న వుద్యోగం మంచిదిగాదు. అందులో జాయిన్ కాకు. తొందరపడి రాబోయే డిగ్రీ వదిలేయకు. నీ సంగతులు నువ్వు చూసుకుంటూ, రాత్రిళ్లు గూడా పనిచేయాలీ అంటే అర్థం గావటం లేదూ? బాదరబందీ లేకుండా హమేషా అందుబాటులో వుండాలి. పదో అయిదో చేత బెడతాడు. మరొక అమ్మాయి జాయిన్ కాగానే, నీకుద్వాసన చెపుతాడు. నయం. సమయానికి నేనా రైలులో అదే పెట్టెలో వున్నా గనక సరిపోయింది. టికెట్ లేకుండా ప్రయాణం చేసే వారిని లాకప్‌లో వుంచుతారు. నీకు

తెలియదేమో. చెకింగ్ ఆఫీసర్ తెలుసు గనక, యిచ్చింది పుచ్చుకున్నాడు. ఇంటికి చేరావు. మరెప్పుడూ యిటువంటి అనాలోచితమైన పనిచేయకు''.

''నన్ను గురించి మీకింత విచారమెందుకూ? మీరైతే చేతికందుబాటులో వుంటే, అయిదో, పదో కాక, వేలల్లో యిస్తారా?'' అన్నాను నవ్వేస్తూ.

ఆయనా నవ్వాడు. ''నాకేం అభ్యంతరం లేదు. ఆ సమయానికి చేతులో వుండాలే గాని, నా పేకాటకు మాత్రముంచుకుని, తక్కినదంతా యిచ్చేస్తా. యెంతున్నదని గూడా చూడను''.

''దీనబంధు సి ఆర్ దాస్ లాగా'' అని మళ్లీ నవ్వాను.

ఈయన కొంతకాకపోయినా కొంతైనా సత్యం చెపుతున్నాడనుకున్నాను.

అసలు విషయం తట్టలేదు. మోసపోవటం తేలిక మోసం గ్రహించటం కష్టం. ముసలివాడిని చీదరించుకుని దులిపేసినట్టు, యవ్వనాన్ని ధిక్కరించలేక పోతున్నా. తీయని మాటలు లొంగదీస్తున్నాయి. వీడిని గొంగళి పురుగును చూసినట్టు చూడటం చాతగావటం లేదు. యేదో ఆకర్షణ లొంగదీస్తున్నది. ముసలి లాయరుగారి తిట్టు నిజమౌతుందేమో.

5

వుద్యోగం చిన్నదే అయినా, అన్న అని ప్రేమ నిలుపుకుని, అన్న పోయినా, అన్న పిల్లలూ వదినా అనీ, బంధం చూపుతూ చేయగలిగినమేరకు సాయం చేస్తూ వచ్చిన, మా స్వంత బాబాయి కాస్తా రైలు ప్రమాదంలో పోయాడు. వైరందుతూనే, యింట్లో అంతా మద్రాసుకెళ్లారు. పిన్ని పుట్టిల్లు మద్రాస్.

నాకు పరీక్షలు జరుగుతున్నాయి. చదువుకోమనీ, యింటికి కావలి వుంచీ వెళ్లారు మా వాళ్లంతా. చాపమీద కూచుని టెక్స్ట్ చదువుతున్నాను. కాలింగ్ బెల్ వినబడింది.

తలుపు గడియపెట్టి గొలుసు అడ్డముంచి, సందునించి చూస్తే, బిజినెస్ మాన్ నిలబడి కనిపించాడు. తలుపు బాగా తీశాను. లోపలికొచ్చి,

అనాయాసంగా చాపమీద చతికిల పడ్డాడు. మోకాళ్లు నెప్పి పుట్టుతాయేమోనని కుర్చీ పీట వేశాను.

'' ఇదుగో బల్ల. దీని మీద కూచోండి''.

''వద్దులేగానీ, యిల్లు నిశ్శబ్దంగా వున్నదేం. అంతా యెక్కడి కెళ్లారూ?'' ఆరా తీశాడు.

వచ్చిన ఆపద వివరంగా చెప్పాను.

''అరెరే ! అయ్యో పాపం. నాకు తెలియదే. నువెళ్లలేదేం మరి?'' అని సింపతీ చూపాడు.

''నేను ఆఖరి పరీక్ష వ్రాయాలి''.

''తక్కినవన్నీ బాగా ఆన్సర్ చేశావా? కనుక్కోనా?'' ఆదుర్దా వెల్లడించాడు.

ఆయనకు మార్కులు వేయించటం, పాసు చేయించటం హాబీ అనీ, సైడు బిజినెస్సనీ గుర్తు వచ్చింది.

''అక్కర్లేదండీ. బాగానే ఆన్సర్ చేశా. మీరు మార్కులూ వేయించక్కర్లేదు, పాసూ చేయించక్కల్లేదు. నేనే గట్టెక్కగలను'' అన్నాను గర్వంగా. చేతుల గోళ్లు చూసుకుంటూ నిలబడే వున్నా.

''భోజనమైందీ? యేమి చేసుకున్నావూ?'' అని లేచి కిచెన్ వేపు వెళ్లాడు. లైటు వేశాడు. అక్కడన్నీ తోమి పెట్టి తళతళలాడుతూ కంటబడ్డాయి.

''వంట చేసుకోలేదూ? ఆకలిగా వున్నదే. యేమీ లేవా? నాకేదైనా తినటానికి పెట్టకపోతావా అనుకుంటినే''

ఆయన నటన చూస్తే నాకు నవ్వు వచ్చింది.

'' యేం లేవండి. నాకు ఆకలిగా లేక, టైమ్ వేస్టని వండ లేదు'' చేతులు వెనకవుంచుకుని నేలవంక చూస్తూ అన్నాను.

''అయ్యో! హోటల్‌కి పోయి ఒక్క నిమిషంలో కానిచ్చి వచ్చేద్దాం. యేదీ తాళం చెవి'' చెయ్యి జూపాడు.

గోడకు రింగ్ వేలాడుతున్నది. తాళం చెవి అందుకున్నాడు. రెక్క పట్టుకుని లైట్ ఆఫ్ చేశాడు. తలుపు తాళం తిప్పుతుండగా లైట్లు పోయినై. తాళం చెవి తిప్పి జేబులో వేసుకున్నాడు. మేము చౌకగా ఒక చిన్న భాగంలో వుంటున్నాము నాలుగంతస్తులు దిగాలి. గాఢాంధకారం, గాలీ, తుంపరా, మెరుపులూ, వురుములూ.

నా తలలో, విమాన మంటుకుని నేల కూలింది. కొంపలంటుకున్నై. రైళ్లు ఢీ. లారీ తిరగబడింది.

అంతస్తులు ఒక్కొక్కటే దిగుతున్నాము. ఆయన మరీ లాగుతున్నాడు. వేడి వూపిరి నా మొహానికి తాకుతున్నది.

6

క్రిమినల్ లాయరుగారి వుసురు కొట్టనే కొట్టింది. బిజినెస్ మాన్ బిజినెస్ యింప్రూవ్ చేసుకునే పద్ధతులు నేర్వటానికి యెటో పోయాడు. ఐపు లేడు.

ఈ లోపల దినపత్రికలో ప్లేన్ క్రాష్. రైలు నదిలో పడింది. వంతెన కూలింది, రక్షించటానికి రక్షకదళం, హెలికాప్టర్లో వలయాలు తిరుగుతున్నది, టూరిస్ట్ బస్ లోయలోకి దొర్లిపోయింది, హోటల్లో కొంత భాగం అకస్మాత్తుగా నిప్పంటుకున్నది, గుర్తు తెలియని శవాలు, కల్తీ సారా తాగి పై లోకానికి వెళ్లినవాళ్లను వరసగా పక్కపక్కగా పడుకోబెట్టి తీసిన ఫొటోలు, మొదటి పేజీలో పడేవి.

ఎక్స్ట్రీమిస్టు(లు), టెర్రరిస్టు(లు), పీపుల్స్‌వార్ గ్రూప్, సలిపే దారుణాలు, మందుపాతర పేలటం, దురాగతాలు, మనుషుల్ని యెత్తుకుపోవటం చదివాను.

మా అమ్మ వినోదం కోసం లోకాన్ని నమ్మించటానికీ, కల్లబొల్లి యేడుపులూ, నిందలూ సాగించింది.

''అయ్యో! ధాతా! రాత! ధాత! రాత గదే కూతురా ! అంటే, కోతి మొగుడే అమ్మా!' అన్నదట కూతురు. అలాగా యిదేం అల్లుడూ! మాయదారి మనిషీ! మాయమైనాడూ! యే దారీ చూపలేదు. ఓ వేడుకాలేదూ, వైభవం అసలే లేదూ''.

నన్ను గెంటేయనూ లేక, గౌరవంగా చూడనూ లేక, డైలమ్మాలో పడింది మా అమ్మ. పరిస్థితేమో సంఘ విరుద్ధమైన పరిస్థితీ బాంక్‌లో వున్న కొద్ది బాలెన్సూ నా విలువ చెపుతుంది.

నేనేమో, చీకట్లో గాలీ వానలో, తిండికోసం, బిజినెస్ వాడితో వెంట వెళ్లినందుకు, చెంపలేసుకోవాలా, లేక, 'అంగాన్‌మె ఆయా మేరె చిత్తచోర్', అని పాడుకున్నందుకు విచారించాలా, నలుగురెదుటికీ వెళ్లి వాడిదే తప్పని ఫిర్యాదు చేయాలా అని ఆలోచిస్తున్నా. అంతలోనే నవ్వు వచ్చింది.

''ముసలి లాయరుగారు, సర్వాధికారాలిస్తానన్నాడే, పల్లెత్తుమాట అనన్నాడే, భారు భూరుమంటూ, పెళ్లాడతానన్నాడే,'' అనుకుని తిట్టుకుని, తెలియక మోసపోతినే' అనుకుని, ముందుగతి కానకుండా, నా కళ్లు చెప్పినట్టు చేశానే' అనుకుని, యేటికెదురీదాలని సరిపెట్టుకున్నాను.

లేడీ డాక్టర్ సలహా నచ్చలేదు. సంఘాన్నీ తల్లినీ వదిలి మారుమూల గ్రామంలో ఒంటరిగా వుండలేను. భక్త రామదాసే మన్నాడూ, ''తరమా! యిరుమూటిని గెల్వ'' అన్నాడు.

తలుపు చప్పుడైంది. తీశాను.

దీనికంతకూ బీజం వేసిన స్నేహితురాలు యామిని, చేతులో వారపత్రికతో వచ్చింది. లోపలికొచ్చి చాపమీద కూచుని పత్రిక విప్పింది.

''నీ ట్రాన్స్‌లేటెడ్ నవల, ధారావాహికంగా వేస్తున్నారు. చూసుకోలేదా? నీకింకా పత్రిక అందలేదా?'' అన్నది.

ఓదార్పు కోసం అంటున్నదనుకుని పత్రిక చూశాను. ఎక్సైటై పోయాను. నెప్పి మొదలైంది. చాపమీద వెల్లికలా పడుకున్నాను.

''వాళ్లవాళ్లను చూసి రాలేదూ?'' అనడుగుతున్నది.

సీలింగ్ వంక చూస్తున్న నేనన్నాను.

''నీదంతా హాస్యం యామినీ! మా అమ్మ ధాటికి తాళలేక ఆ మొక్కు తీర్చానోయ్! వాళ్లేమన్నారో విని ఆనందించు. ఒక బిజినెస్ మాన్ అహూజాలాగా, యీ బిజినెస్మాన్ గూడా,

''తిరిగిన ప్రతీ ఆడదాన్నీ పెళ్లాడుతూ పోతే, యీ పాటికి, మా వాడికి, శ్రీ కృష్ణునకున్నట్టు, పదియారువేల గోపికలుండేవారు'' అన్నారు. అంతేగాక, దవడలు నొక్కుకుని, ''నిన్నా! మా వాడా! పెళ్లాడాడూ! ఇంకెక్కడా నీ వంటి కోతి దొరకలేదటనా? పెళ్లి అయిందనే అనుకుందాము, మీ పెళ్లికి మేం రాలేదు. యే పాడుబడిన గుళ్లో చేసుకున్నారో, ఆ ఊాతిదేవుడితోనే చెప్పుకో. మా వాడెక్కడున్నాడో మాకూ తెలియదు. నీకు మేము సూడిదలివ్వాలా?'' అంటూ మొహం మీదే నవ్వారు''.

యామిని టీ టిఫెన్ చేసింది. ఆరగించాము. సాయంకాలం నాలుగౌతున్నది. దినపత్రికా, వారపత్రికలు రెండూ వచ్చినై. యామిని వాటిని తిరగేసి పెద్దకేకపెట్టింది. నేను యామిని వేపు తిరిగి పత్రికలందుకుని తిరగేశాను.

ఒక వారపత్రికలో నా స్వీయ రచన పడింది. మరొక పత్రికలో, 'నిన్ను నమ్మినందుకు పన్నగాధిపశయన, మన్నించి నను బ్రోవరో!' అనే లలిత గేయం పడింది. నా పేరు చూసుకుని పొంగిపోతుండగా, నెప్పులెక్కువైనై.

మా అమ్మ బంధువుల యింటినించి వచ్చింది. గలాభా చేసింది. యామిని, నా చెంపల మీదా, తలమీదా రాస్తూ, ''అన్నమాట నిలబెట్టుకున్నాడోయ్ బిజినెస్ మానూ! నీ పంట పండింది. యెప్పటినించో తపిస్తున్నావు. రచయిత్రి వైనావు. వేయిస్తానన్నాడు వేయించాడు'' అని నవ్వుతున్నది. చెయ్యి పట్టుకుని చేతిమీద రాస్తున్నది. నాకు పలుగుతో పొడుస్తున్నట్టు నెప్పి యెక్కువౌతూ కళ్లు మూతలు పడుతూ, చెమటలు పడుతున్నాయి. గమ్యం దూరమనుకున్నా. ఫెళఫెళమంటూ, గొడ్డలిపోట్లు యెక్కువైనౌ.

యెదుటి భాగంలోని వృద్ధమాత, ''కొడుకును గన్నావేవ్! తుంటరీ!'' అన్నది.

మా అమ్మ, ''అదేమిటో చదువమ్మా! నా కింగ్లీషు రాదు'' అన్నది. చేతికి కాగితమందించింది. చెమట చేతులతో విప్పి చదివాను. అది టెలిగ్రామ్.

''క్షేమం. వస్తున్నా. ప్రమాదానికి లోనైనాను'' ఆగ్రా. జనరల్ హాస్పిటల్. బిజినెస్ మాన్.